# నమస్తే తెలంగాణ
# హనుమకొండ
5 | వరంగల్, బుధవారం 25 సెప్టెంబర్ 2024 | HANUMAKONDA




ప్రసాదాల తయారీని తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి

## భద్రకాళీ ఆలయంలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

**ప్రసాదాలు, ముడి సరుకుల శాంపిల్స్ సేకరణ**

వరంగల్, సెప్టెంబర్ 24 : వరంగల్ నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ ఆలయంలో ఫుడ్ సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి నేతృత్వంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఆలయంలో తయారు చేసే లడ్డూ, పులిహోరతోపాటు ప్రసాదాల తయారీకి వినియోగిస్తున్న నెయ్యి, నూనె, పప్పు, పల్లీలు తదితర ముడిసరుకులను నాణ్యతను పరిశీలించారు. వాటితో పాటు ప్రసాదాలు తయారు చేసే వంటశాలను, పరిసరాలను తనిఖీ చేశారు. అలాగే లడ్డూ, పులిహోర ప్రసాదాలతో పాటు వాటి తయారీకి వినియోగిస్తున్న ముడి సరుకుల శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించారు. ఈ సందర్భంగా జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగానే భద్రకాళీ ఆలయంలో ప్రసాదాలను పరిశీలించామన్నారు. వంటశాల నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.



భూపాలపల్లిలో రాష్ట్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

## 33 శాతం లాభాల వాటాను చెల్లించాలి

- సింగరేణి కార్మికులకు 16.9 శాతమే చెల్లిస్తామనడం సిగ్గుచేటు
- టీబీజీకేఎస్ బ్రాంచి కమిటీ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య

కృష్ణ కాలనీ, సెప్టెంబర్ 24: సింగరేణి కార్మికులకు వాస్తవ లాభాల వాటా 33 శాతం చెల్లించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) భూపాలపల్లి బ్రాంచి కమిటీ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య డిమాండ్ చేశారు. కార్మికులకు 16.9 శాతం లాభాల వాటాను ఇస్తానని ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ సగం మాత్రమే చెల్లిస్తానని రాష్ట్రప్రభుత్వం ప్రకటించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కార్మిక కుటుంబాల పొట్టగొట్టే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు నల్లవెల్లి సదానందం, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవరకొండ మధు, బాసనపల్లి కుమారస్వామి, జీ రామచందర్, అన్నాడి మల్లారెడ్డి, నరేశ్‌నేత, రాజేందర్, లక్ష్మణ్, గువ్వల శంకర్, భోగం నరేందర్, రమేశ్, ఆకుల కిషన్ రెడ్డి, కిరణ్, విజేందర్ రెడ్డి, టేకుమట్ల రాజయ్య, రమణారెడ్డి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

బల్దియా కౌన్సిల్ సమావేశం నుంచి డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్‌తో పాటు బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. సమస్యలపై మాట్లాడేందుకు సమయం ఇవ్వకుండా మైక్‌లు కట్ చేస్తుండడంతో బీఆర్ఎస్ సభ్యులు పోడియం వైపు దూసుకెళ్లి ఆందోళనకు దిగారు. దీంతో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వారిని సముదాయించారు. మాట్లాడేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో వెనక్కి తగ్గారు. మళ్లీ అదే వివక్ష చూపడంతో మేయర్ వైఖరిని నిరసిస్తూ కౌన్సిల్ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. సొంత పార్టీ కార్పొరేటర్లకు నిధులు కేటాయించి.. విపక్ష కార్పొరేటర్ల డివిజన్లపై చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు.

## పోటాపోటీగా బైఠాయింపులు

కౌన్సిల్ సమావేశానికి ముందు బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు నిరసనలు చేశారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు కౌన్సిల్ హాల్‌కు వెళ్లే ప్రధాన గేట్‌కు అడ్డుగా బైఠాయించారు. బీజేపీ కార్పొరేటర్లు మెయిన్ గేట్ ముందు కూర్చొని మేయర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మేయర్ పక్షపాత వైఖరి నశించాలంటూ సుమారు అరగంట పాటు బైఠాయించిన బీఆర్ఎస్, బీజేపీ సభ్యులను పోలీసులు సముదాయించి ఆందోళనను విరమింపజేశారు.



ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లను సముదాయిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

- పోటాపోటీగా బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్ల నిరసనలు
- పోడియం ముందు బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన
- మేయర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు
- పక్షపాత వైఖరికి నిరసనగా సభ నుంచి వాకౌట్
- రూ.100 కోట్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- రూ.33 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం
- ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా మంత్రి కొండా సురేఖ ప్రమాణం

# రసాభాస

## గంగరగోళంగా గ్రేటర్ కౌన్సిల్ సమావేశం

వరంగల్, సెప్టెంబర్ 24 : గ్రేటర్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్ల నిరసనలు, నినాదాల మధ్య బల్దియా ఆవరణంతా దద్దరిల్లింది. సమావేశం ప్రారంభానికి ముందే బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు ప్రధాన గేట్ల ఎదుట బైఠాయించి మేయర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు వరంగల్ కార్పొరేషన్‌లోని కౌన్సిల్ హాల్‌లో మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగిన బల్దియా సర్వసభ్య సమావేశం గందరగోళంగా మారింది. బీఆర్ఎస్ సభ్యులు మేయర్ పోడియం వద్దకు దూసుకెళ్లి ఆందోళనకు దిగారు. అయినా మేయర్ పక్షపాత వైఖరి అవలంబించడంతో సభ్యులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. తొలుత ఇటీవల మృతిచెందిన 61వ డివిజన్ కార్పొరేటర్ ఎలకంటి రాములు, మాజీ కార్పొరేటర్ యెలుగం శ్రీనివాస్‌లకు సంతాపం తెలుపుతూ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆ తర్వాత కౌన్సిల్ ముందుంచిన 17 ఎజెండా అంశాల్లో 16 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. మంత్రి కొండా సురేఖ బల్దియా ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. వంద కోట్ల నిధులు ప్రత్యేకంగా నగరాభివృద్ధికి కేటాయించాలనే ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపి కౌన్సిల్‌లో తీర్మానం చేశారు.

**అధికారులపై మంత్రి ఫైర్**

అధికారులపై మంత్రి కొండా సురేఖ ఫైర్ అయ్యారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులు ఏం చేస్తున్నారంటూ మంత్రి సురేఖ మండిపడ్డారు. మెప్మా విభాగం టీఎంసీ రమేశ్‌పై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్పీల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని పద్ధతి మార్చుకోవాలని రమేశ్‌ను మంత్రి మందలించారు.

**16 ఎజెండా అంశాలకు ఆమోదం**

17 ఎజెండా అంశాల్లో 16 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. విధి నిర్వహణలో ప్రమాదాలకు గురై మృతిచెందిన కార్మికుడు, కుక్కల దాడిలో మృతి చెందిన బాలుడి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించే అంశాలకు ఓకే చెప్పారు. అన్నపూర్ణ పథకంలో భాగంగా 5 రూపాయల భోజనం అందించే అక్షయపాత్ర సంస్థకు 10 నెలల బిల్లు చెల్లించేందుకు ఆమోదించారు. మున్సిపల్ కమర్షియల్ కాంప్లెక్స్‌ల షట్టర్లకు అద్దె టెండర్లు నిర్వహించేందుకు ఓకే చెప్పారు. ఇంటింటా చెత్త సేకరణ, తాగునీటి సరఫరాలో వినియోగించుకునేందుకు కొత్తగా 250మందిని ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించుకునేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఇండోర్, కొచ్చి నగరాల్లో అవలంబిస్తున్న అభివృద్ధి పద్ధతులను అధ్యయనం చేసేందుకు కార్పొరేటర్ల స్టడీ టూర్‌కు కౌన్సిల్ ఓకే చెప్పింది. వీటితో పాటు కార్మికుల పెండింగ్ వేతనాల చెల్లింపులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సమావేశంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, తదితరులు పాల్గొన్నారు.



ఎక్స్ అఫీషియో సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న మంత్రి కొండా సురేఖ

## వంద కోట్ల నిధులకు కోసం ప్రతిపాదనలు

నగరాభివృద్ధికి ప్రత్యేకంగా వంద కోట్ల నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించాలన్న తీర్మానానికి బల్దియా సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు. దీంతో పాటు వివిధ పథకాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల నిధులను విడుదల చేయాలన్న తీర్మానానికి సభ్యులు ఆమోదం తెలిపారు. ఇంటి ఆస్తి పన్ను మదింపు కోసం సెల్ఫ్ అసెస్‌మెంట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చిన వారికి విధించిన 25 రెట్ల జరిమానాలు మాఫీ చేసేందుకు కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. ఒకే ఇంటికి రెండు నల్లా పన్నులు వస్తున్న వాటి వివరాలు సేకరించి వాటిని రద్దు చేయాలని సమావేశంలో ప్రతిపాదించారు.



### రూ.33కోట్ల అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్

15వ ఆర్థిక సంఘం మిగులు నిధులతో చేపట్టనున్న రూ.30 కోట్ల అభివృద్ధి పనులతో పాటు పారిశుధ్య వాహనాల కొనుగోలు ప్రతిపాదనలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మెరుగైన పారిశుధ్య వ్యవస్థ కోసం స్వచ్ఛ ఆటోలు, చెత్త తరలింపు కోసం కంపాక్టర్లు, ట్రాక్టర్లు, కార్మికులకు అందించే పనిముట్ల కొనుగోలు, జంక్షన్ల అభివృద్ధి, వరద కాల్వలు, మురుగు నీటి కాల్వలు, సీసీ బాక్స్ డ్రైన్, సీసీ రోడ్ల నిర్మాణాలకు సైతం ఆమోదం తెలిపారు.

కౌన్సిల్ హాల్ ఎదుట గేట్ ముందు బైఠాయించిన బీఆర్ఎస్ కార్పొరేటర్లను వారిస్తున్న పోలీసులు

### సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

ఖమ్మం, కరీంనగర్ రహదారుల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి. పారిశుధ్య కార్మికుల కొరతను అధిగమించాలి. కొత్తగా 250 కార్మికుల నియామక ప్రక్రియను వెంటనే చేపట్టాలి. యువతను క్రీడల వైపు మళ్లించేందుకు ఇండోర్ స్టేడియాల నిర్మాణాలు చేపట్టాలి.

– కేఆర్ నాగరాజు, వర్ధన్నపేట ఎమ్మెల్యే

### నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

వరంగల్ నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు బహుముఖ వ్యూహాలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారు. 2050 అవసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్‌ను రూపొందిస్తున్నాం. వరంగల్‌ను ఫ్యూచర్ సిటీగా తీర్చిదిద్దుతున్నాం. వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కృషిచేస్తున్నాం. నగరాభివృద్ధి కోసం రూ. వంద కోట్ల ప్రత్యేక నిధుల విడుదలకు కృషి చేస్తా.

– కొండా సురేఖ, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి

### అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి ప్రణాళికలు

వరంగల్ నగరంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రత్యేకంగా డీపీఆర్‌లను సిద్ధం చేస్తున్నాం. స్మార్ట్‌సిటీ, జనరల్ ఫండ్లతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. నయీంనగర్ నాలా విస్తరణ, బ్రిడ్జి నిర్మాణ పనులను ఆరు నెలల్లో పూర్తి చేశాం, నగర ముంపు నివారణకు శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. మహిళా ఆర్థికాభివృద్ధి కోసం బల్దియా ఆధ్వర్యంలో ఆరు ఇందిరా మహిళా క్యాంటీన్లను ప్రారంభిస్తాం.

– గుండు సుధారాణి, మేయర్

### సభ్యులందరికీ అవకాశమిచ్చాం

బల్దియా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అన్ని పార్టీల సభ్యులకు సభలో మాట్లాడే అవకాశం కల్పించాం. నగరాభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం. నగరాభివృద్ధికి హైడ్రా లాంటి విధానాలను త్వరలో సీఎం ప్రకటిస్తారు.

– నాయిని రాజేందర్‌రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే

### విలీన గ్రామాల్లో తాగునీటి సమస్య

విలీన గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. నిరుపయోగంగా ఉన్న బావులకు మోటర్లు బిగించి వినియోగంలోకి తీసుకురావాలి. బతుకమ్మ పండుగ నేపథ్యంలో గ్రామాల్లో వీధి స్తంభాలకు కొత్త లైట్లు ఏర్పాటు చేయాలి. బతుకమ్మ పండుగ ఏర్పాట్లు చేయాలి

– రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరకాల

## దంచికొట్టిన వాన

- ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం
- వరంగల్ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయం
- పిడుగుపాటుకు వ్యక్తి మృతి.. ఇల్లు ధ్వంసం



జిల్లా కేంద్రంలోని ఓ టీస్టాల్‌లోకి చేరుకున్న వరద నీరు

ఖిలావరంగల్/గిర్మాజీపేట/కొత్తగూడ/భీమదేవరపల్లి/కృష్ణకాలనీ/పరకాల, సెప్టెంబర్ 24 : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఖిలా వరంగల్ మండలంలో 124.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వరంగల్ నగరంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి బృందావన్, సాయినగర్, సంతోషిమాత, ఎన్‌టీఆర్‌నగర్ కాలనీలు జలమయమయ్యాయి. ఇండ్లలోకి వరదనీరు చేరడంతో అధికారులు వారిని పునరావాస కేంద్రానికి తరలించారు. వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్‌తో కలిసి అదనపు కలెక్టర్ సంధ్యారాణి పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని బత్తులపల్లికి చెందిన దుర్గం లక్ష్మయ్య (65) మక్కజొన్న పంట కాపలాకు వెళ్లి తిరిగి వస్తుండగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో సోమవారం రాత్రి పిడుగు పడి ఎర్రబొజ్జు రాధిక ఇల్లు ధ్వంసమైంది. సామగ్రితో పాటు ట్రంకు పెట్టెలోని రూ. 3 లక్షల నగదు కాలి బూడిద కాగా, గోడలు బీటలు వారాయి. ఇంట్లో వారు ఊరెళ్లడంతో ప్రాణనష్టం తప్పింది. అలాగే పరకాల మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపురంలో పిడుగుపడి నల్లెల్ల కుమారస్వామికి చెందిన పాడి గేదె మృతి చెందింది. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. సుమారు 2 గంటలపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి.



పట్టుకున్న గంజాయి, వాహనాన్ని చూపుతున్న పోలీసులు

## 187 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్ట్.. పరారీలో మరొకరు..
- రెండు వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మానుకోట డీఎస్పీ తిరుపతిరావు

గూడూరు, సెప్టెంబర్ 24 : మహబూబాబాద్ మీదుగా హైదరాబాద్‌కు రెండు వాహనాల్లో తరలిస్తున్న 187 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు, ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. మరొకరు పరారీలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. గూడూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని మచ్చర్ల గ్రామం వద్ద సోమవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా మారుతి ఎర్టిగా, మహీంద్రా ఎక్స్‌యూవీ కార్లలో గంజాయిని గుర్తించారు. దీనిని తరలిస్తున్న ఒడిస్సా రాష్ట్రానికి చెందిన మండల నరేశ్, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రాహుల్ ముజుందార్, హరీశ్ యాదవ్‌ను అదుపులోకి తీసుకోగా, ఒడిస్సాకు చెందిన మరో వ్యక్తి బాపన్ పరారయ్యాడని డీఎస్పీ తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 46.76 లక్షలుంటుందన్నారు. గంజాయి పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ బాబూరావును డీఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అక్రమ వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలుంటాయని, గంజాయితో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే శిక్ష తప్పదన్నారు. సమావేశంలో సీఐ బాబూరావు, గూడూరు, కొత్తగూడ ఎస్సైలు గిరిధర్‌రెడ్డి, కుశకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## మిల్లుల్లో సీఎంఆర్ గల్లంతు

**అధికారుల దాడులతో వెలుగులోకి..**
**రూ. 14.67 కోట్ల ధాన్యం మాయంపై క్రిమినల్ కేసులకు సిఫారసు**



మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

జనగామ, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ)/గూడూరు, సెప్టెంబర్24: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని అప్పరాజుపల్లి, జనగామలోని దేవరుప్పుల మండలం మన్‌పహాడ్‌పల్లి గ్రామాల్లోని రైస్ మిల్లులపై సివిల్ సప్లై అధికారులు మంగళవారం దాడులు జరిపారు. ఈ దాడుల్లో మొత్తం రూ. 14. 67 కోట్ల సీఎంఆర్ గల్లంతైనట్లు గుర్తించి, క్రిమినల్ కేసులకు సిఫారసు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. అప్పరాజులపల్లిలోని శ్రీరాజరాజేశ్వరి మిల్లులో సివిల్ సప్లై అధికారులతోపాటు గూడూరు తహసీల్దార్, టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు తనిఖీ చేయగా రూ. 9కోట్ల 56లక్షల 73 వేల ధాన్యం దుర్వినియోగమైనట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఇంత పెద్ద ఎత్తున ప్రభుత్వ ధాన్యాన్ని దుర్వినియోగం చేసిన మిల్లు యాజమాని భూక్యా నవీన్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు రాష్ట్ర సివిల్ సప్లై ఓఎస్‌డీ ఎం ప్రభాకర్ తెలిపారు. అదేవిధంగా మన్‌పహాడ్ శ్రీ సాయిరాం మాడ్రన్ బిన్నీ రైస్‌మిల్లులో రూ.5.67 కోట్ల విలువైన 1774.071 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్‌ను యజమాని దారి మళ్లించారు. ఈ మేరకు జిల్లా అధికారుల తనిఖీలో రైస్ మిల్లులో ధాన్యం నిల్వలు మాయమైనట్లు తేలడంతో మిల్లు యజమాని పి.చంద్రశేఖర్‌రెడ్డిపై మంగళవారం దేవరుప్పుల పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత అధికారులు ఫిర్యాదు చేశారు.

రైస్ మిల్లర్, అతని కుటుంబసభ్యుల పేరిట ఉన్న ఆస్తులపై ఎటువంటి లావాదేవీలను అనుమతించవద్దని జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లకు లేఖ రాశారు. ఈ దాడుల్లో టీసీఎస్‌వో ప్రేమ్‌కుమార్, జిల్లా సివిల్ సప్లై అధికారి కృష్ణవేణి, తహసీల్దార్ శ్వేత, ఏఎస్‌వో రమేశ్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై కృష్ణ, ఆర్ఐ మల్లయ్య పాల్గొన్నారు.

## మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్యపై బదిలీ వేటు

**ఐజీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు**

సుబేదారి, సెప్టెంబర్ 24 : మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ పీ మల్లయ్యపై బదిలీ వేటు పడింది. ఈ మేరకు ఆయనను ఐజీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ మంగళవారం వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా ఉత్తర్వులు జారీ చేశారు. గత నెలలో వరంగల్ కాశీబుగ్గలో నిర్వహించిన మంత్రి కొండా సురేఖ బర్త్‌డే వేడుకల్లో ఏసీపీ నందిరాం నాయక్, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్లు ఎం శివకుమార్, మల్లయ్య అధికార పార్టీ కార్యకర్తలు, రౌడీ షీటర్స్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పటాకులు పేల్చడంతో ముగ్గురు గాయపడిన విషయం తెలిసిందే. అలాగే మంత్రి సురేఖ భర్త కొండా మురళీధర్‌రావు గత నెలలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని శ్రీపతిపల్లి గ్రామంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరు కాగా, ఆయనకు వీరిద్దరు ఎస్కార్ట్‌గా వెళ్లారు. అప్పట్లో ఈ రెండు ఘటనలు తీవ్ర విమర్శలకు దారి తీశాయి. ఈ నేపథ్యంలో వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్‌తో పాటు ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు పోలీసు నిబంధనలు ఉల్లంఘించిన తీరుపై విచారణ జరపాలని సెంట్రల్ జోన్ డీసీపీని సీపీ అంబర్ కిషోర్‌ఝా ఆదేశించారు. విచారణ అనంతరం ముందుగా ఇన్‌స్పెక్టర్ మల్లయ్యపై బదిలీ వేటుపడినట్లు సమాచారం. కాగా ఏసీపీ నందిరాం నాయక్, ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌ను కూడా బదిలీ చేసేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తున్నది. హద్దు మీరి ప్రవర్తించే పోలీసులపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ మల్లయ్య బదిలీతో మరోసారి స్పష్టమైంది.

## బస్సుల ట్రిప్పులను పెంచుతాం

**ఆర్టీసీ వరంగల్-2 డిపో మేనేజర్ జ్యోత్స్న**

ములుగు, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : హనుమకొండ నుంచి ములుగు వైపు బస్సు ట్రిప్పులను పెంచుతామని ఆర్టీసీ వరంగల్-2 డిపో మేనేజర్ జోత్స్న తెలిపారు. 'నమస్తే తెలంగాణ'లో మంగళవారం 'ములుగు చేరేదెప్పుడో..? కథనం ప్రచురితమవగా ఆమె స్పందించారు. ఈ మేరకు ఆమె 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. హనుమకొండ నుంచి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం వరకు సరిపడా బస్సు సర్వీసులు నడిపిస్తామన్నారు. ఇప్పటికే అనుకున్న మేర సర్వీసులు కొనసాగుతున్నాయని, పండుగ, సెలవు రోజుల్లో రద్దీ పెరిగినందున సమస్య ఏర్పడుతున్నట్లు చెప్పారు. రాత్రి 7గంటల నుంచి అర గంటకు ఒకటి చొప్పున ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుస్తున్నాయని, మరిన్ని బస్సులను ప్రయాణికుల సౌకర్యార్థం నడిపిస్తామని తెలిపారు. అలాగే డయల్ యువర్ డీఎంకు తొమ్మిది మంది ప్రయాణికులు ఫోన్ చేసి సమస్యలను వివరించారన్నారు. ఇందులో కేశవాపురం మీదుగా పరకాలకు బస్సు ట్రిప్పులను పెంచాలని, మంగపేటకు సాయంత్రం వేళలో బస్సును నడిపించాలని, పొట్లాపూర్‌కు బస్సు ట్రిప్పులను పెంచాలని, మల్లంపల్లికి షెటిల్ బస్సులను నడపాలని ప్రయాణికులు కోరారన్నారు. వీటన్నింటిని పరిశీలిస్తామని తెలిపారు.

**నమస్తే ఎఫెక్ట్**

### రామప్ప ఉపాలయాలకు భద్రతా సిబ్బందిని నియమిస్తాం

- పురావస్తు శాఖ అధికారులు

ములుగురూరల్, సెప్టెంబర్ 24 : రామప్ప దేవాలయంతో పాటు ఉపాలయాల వద్ద భద్రతా సిబ్బందిని నియమిస్తామని పురావస్తు శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న గొల్ల గుడి వద్ద తవ్వకాలు చేపట్టి ఆలయ మండపం మధ్యలో అలంకరించిన తామర మొగ్గను ధ్వంసం చేశారు. వాస్తు శిల్పం దెబ్బతిని నేలపై పడి ఉండగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గుర్తు తెలియని వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

23న కలెక్టర్ సందర్శించి ఆలయ భద్రతకు పలు అంశాలు సూచించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆలయాల వద్ద నిరంతరం భద్రతా సిబ్బందిని నియమించి చుట్టూ సోలార్ లైట్లను అమర్చి సీసీ కెమెరాలతో పరిరక్షణ చర్యలు చేపడుతామన్నారు.

## జోరుగా హుషారుగా..

**కేఎంసీలో ఉత్సాహంగా కార్నివాల్ నైట్**

- మ్యూజికల్ బ్యాండ్, ఫుడ్ ఫెస్టివల్, సాంస్కృతిక ప్రదర్శనలతో వేడుకలు
- ఆటపాటలతో అదరగొట్టిన వైద్య విద్యార్థులు



ఉత్కర్ష-2024లో భాగంగా కేఎంసీలో మంగళవారం నాలుగో రోజు కార్నివాల్ నైట్ సంబురంగా సాగింది. ఉదయం కాన్ఫరెన్స్ హాల్‌లో రక్తదాన శిబిరంతో మొదలై సాయంత్రం ఎన్ఆర్ఐ భవన్‌లో ఫుడ్ ఫెస్టివల్, మ్యూజికల్ బ్యాండ్, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించగా వైద్య విద్యార్థుల ఆటాపాటలు, కేరింతలతో కళాశాల ప్రాంగణమంతా హోరెత్తింది. కేఎంసీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆశాదేవి ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి సామాజిక స్పృహ కలిగించేలా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. శిబిరంలో 60 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. అనంతరం ఫుడ్ ఫెస్టివల్ సందర్భంగా స్టాల్స్‌లో రుచికరమైన వంటకాలు చేసి విద్యార్థులకు వడ్డించారు. అలాగే విద్యుత్ వెలుగుల్లో విద్యార్థులు అర్ధరాత్రి వరకు ఆటపాటలతో అదరగొట్టారు. బుధవారం సంప్రదాయ దినోత్సవం, దాండియా నైట్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

– వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 24




కార్నివాల్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినులు



మ్యూజికల్ బ్యాండ్ కార్యక్రమంలో పాటలు పాడుతున్న విద్యార్థులు